# లిపి పరిణామ వికాసం

ఆచార్య. జి. అరుణకుమారి

భారతదేశంలో లిపికి రెండువేల ఐదువందల సంవత్సరాల చరిత్ర ఉంది. క్రీస్తు పూర్వం మూడు వేల సంవత్సరాల నుండి పదిహేడు వేల సంవత్సరాల మధ్య కాలంలో అంటే సుమారు 13, 14 వందల సంవత్సరాలు సింధూ లిపి వాడుకలో ఉన్నట్లుగా చరిత్రకారులు చెబుతున్నారు.

రాత తెలియక ముందు ప్రజలు రకరకాల ముడులు వేసే వారు. చీనా దేశీయులు, మెక్సికన్లు, పారశీకులు, పెరూ దేశీయులు మూడు రాతలలో నేర్పరులు. రంగు రంగు దారాలను కర్రలకు చుట్టి ముడి వేస్తారు. రంగులు ఎన్నో సంకేతాలను అందిస్తాయి. నలుపు మరణానికి, తెలుపు శాంతికి, ఎరుపు యుద్ధానికి, పసుపు బంగారానికి, పచ్చ ధాన్యానికి సంకేతాలన్నమాట. ఈ ముడుల భాషకి గ్రంథ వర్ణమాల అని, క్వీపా అని పేరు.

అమెరికా ఆదివాసులు ముడులకు బదులుగా రంగురంగుల పూసలు, గవ్వలు వాడేవారు. రంగు రంగు పూసల దండలను కటకాలు అనేవారు. పైన చెప్పిన రంగుల సంకేతాలే పూసల రంగులకి వర్తిస్తాయి. ఒక తెగ వారు మరొక తెగ వారికి వార్తలు పంపవలసి వస్తే దూతలతో ఈ రంగుల కటకాన్ని పంపేవారు. వీటికి వామ్పమ్ అని పేరు.

ఆతరువాత క్రమేపి శుద్ధతో కానీ, బొగ్గుతో కానీ, ఎర్రమట్టితో కానీ గోడల మీద గీతలు గీయటం మొదలుపెట్టారు. రెండువేల ఏళ్ళ నాటి గాథాసప్తశతిలో భర్త, అప్పుడొస్తాడు ఇప్పుడొస్తాడని ఒక స్త్రీ గోడల నిండా గీతలు గీసిందనే వర్ణన ఉంది. సెర్బియా దేశపు ప్రజలు ఇంటి ద్వారబంధాలకు గాట్లు పెట్టి లెక్కలు గణించేవారు. కర్రను రెండుగా చీల్చి, ఒకటి వర్తకుడి దగ్గర మరొకటి ధాన్యం అప్పుగా తీసుకున్న వ్యక్తిదగ్గర ఉంచేవారు. అప్పు తీర్చే సమయంలో కర్ర ముక్కలని జోడించి లెక్క తేల్చేవారు.

కొన్ని జాతుల వారు కయ్యానికి కాలు దువ్వవలసి వస్తే బల్లెమో బాణమో పంపేవారు. ప్రజలు రాత నేర్చుకోవడానికి ముందు వస్తువులతోనే జాబులు రాసుకునే వారు. క్రమేపి వస్తువుల స్థానంలో బొమ్మలు చోటు చేసుకున్నాయి. చెట్టు పట్టల పైన, దుప్పి తోలుపైన, దంతాల పైన , ఎముకలపైన, విల్లుకు బదులుగా విల్లు బొమ్మలు వేసి పంపేవారు. ఆ పైన గ్రామాల పొలిమేర్లలో గానీ, చెరువు గట్ల మీద కానీ, కోట గవనుల ముందు కానీ, రాతి బండల మీద కానీ బొమ్మలు చెక్కి వీరుని మరణాన్ని అతని గొప్పతనానికి సంబంధించిన సమాచారాన్ని అందించేవారు. ఈ బొమ్మల సంకేతాలున్న రాతి బండలను వీరగల్లులనేవారు. ప్రపంచమంతటా ఈ చిత్రాక్షరాలే ప్రపంచ రాతగా నిలిచాయి. ఈ విధంగా చిత్ర లిపి బొమ్మల రాత క్రమంగా గూఢ సంకేతాలుగా నిలిచి ఆపైన వంకర గీటుల లిపిగా మారి, ఆపైన ప్రజల చేతివాటంతో నడిచి గొలుసుకట్టు రాతగా మారి, క్రమేపి ఒక స్థిరమైన ఆకారంతో అక్షరాల రూపంలో నిలిచిందన్న మాట.

లిపి బాణాల్లా ఉండటం వలన బాణ లిపి, క్యూనిఫారం అని అన్నారు. అరబ్బులు ఈ రాతను మేకుల్లా ఉండటం వలన కీలి లిపి అని వ్యవహరించారు. ఈజిప్టు వారు చిత్ర లిపులతో పాటు ధ్వనివాచక సంకేతాలను అక్షరాలను కూడా వాడటం మొదలు పెట్టారు. తెలుగు లిపి కూడ చిత్రలిపి నుండి రూపొందినదే. ఋగ్వేదంలో లిపికి సంబంధించిన ప్రశంస కనిపిస్తుంది.

‘ఉతత్వ: పశ్యన్ న దదర్శ వాచమ్

ఉతత్వ: శృణ్వన్ న శృణోత్యేనామ్. (10.71.4) అంటే కొందరు వేద వాక్కును చూసి చూడరు. కొందరు వేద వాక్కును విని వినరు. అని ఈ శ్లోకార్థం.

అక్షరేణమిమితే సప్తవాన్

సప్త ఛందస్సులు అక్షరాలతోనే రూపొందుతాయి అనే ఈ ప్రమాణాలను బట్టి దాదాపు ఏడువేల సంవత్సరాకు పూర్వమే లిపి సంగతి మనకు తెలుసు. క్రీస్తు పూర్వం 8వ శతాబ్ది వాడైన పాణిని అష్టాధ్యాయిలో అక్షర, వర్ణ శబ్దాలే కాక లిపి, లిఖి, లిఫికర గ్రంథ పదాలను ఉపయోగించాడు. పాణిని దేశీయ విదేశీయ లిపిని పేర్కొన్నాడు. యవన లిపి, యవనాని అని అన్నాడు. ఇదే కీల లిపి. అక్షర, వర్ణ అనే పదాలు ప్రాచీన కాలం నుండి వ్యవహారంలో ఉన్నవే.

మన తెలుగు అక్షరాలు ఇంత గుండ్రంగా అందంగా అమరడానికి ఎన్నో వేల సంవత్సరాల చరిత్ర ఉంది. మొదటి నుండి మన అక్షరాలు ఆణిముత్యాలే అని అనుకోవద్దు. ఎన్నో వంకర టింకర గీతల నుండి రాతి బండల మీద, రాగిరేకుల మీద, తాటాకుల మీద, కడితాల మీద రాపాడి రాపాడి ఈ రూపాన్ని సంతరించుకున్నాయి.

భాష అనేది ధ్వని రూపాలతో వ్యక్తమవుతుంది. ఈ ధ్వనులు ఇవి, ఇన్ని, వీటికి ఇవి గుర్తులు అనే నిర్ణయమే వర్ణసమమ్నాయం. అక్షరం అంటే క్షరం కానిది. నాశనం లేనిది. మాటలు గాల్లో కలిసి పోతాయి. కానీ సంకేతాలు నశించవు. అవే అక్షరాలు.

లిబ్ అనే ధాతువు నుండి లిపి అనే పదం ఏర్పడింది. లిపి అంటే ఉపదేహమని అర్థం. ధ్వనికి ఉపదేహమే లిపి. లిపికి కుప్పుట, మూయుట అనే అర్థాలున్నాయి. స్వరాన్ని అంటే అచ్చును కప్పేది, రక్షించేది తేఏ అర్థంలో ప్రయోగిస్తున్నారు. కప్పుట మూలంగా విలక్షణమైన ఆకృతిని కలిగిస్తుంది. లేఖన సాధనాలను బట్టి లేఖన పద్ధతులను బట్టి, అక్షరానికి వర్ణం, లిపి, లేఖి, లేఖం, లేఖనం అని పేర్లతో వ్యవహరిస్తున్నారు. రంగులతో రాయడం వలన వర్ణం అని, రంగులు పూయడం వలన లిపి, లేఖి అని, చెక్కడం వలన లేఖం అనే పిలుస్తున్నారు.

లోకంలోని భిన్న వస్తువులకు, మానవ వివిధ స్పందనలకు ధ్వనిమయ రూపాలను కల్పించడానికి ఆదిమ కాలం నుండి జరిగిన, జరుగుతున్న కృషి ఫలితంగా అనేక భాషలు ఉద్భవించాయి. ధ్వనిమయ రూపాలకు దృశ్యరూపాన్ని రూపొందించడానికి వివిధ లిపులు ఆవిర్భవించాయి.

పాణినికి రెండు వందల సంవత్సరాల తర్వాత వాడైన బుద్ధుడు విద్యాభ్యాస సమయంలో గురువు ఆచార్య విశ్వామిత్రుడిని 64 లిపులలో నాకు ఏ లిపిని నేర్పిస్తావని ప్రశ్నించినట్లుగా లలిత విస్తరమనే గ్రంథం తెలియచేస్తుంది. బ్రాహ్మి, ఖరోష్ఠి, పుష్కరసారి, అంగ లిపి, వంగ లపి, మగధ లిపి, ద్రావిడ లిపి, మంగళ్యలిపి, చీన, హూన, అంగులేయ, దేవ, నాగ, యక్ష, కిన్నెర, అసుర... వంటి లిపులు అరవై నాలుగింటిని పేర్కొన్నాడు జైన మత గ్రంథం, 18 లిపులను పేర్కొంది.

మన దేశంలో ఎక్కువ ప్రచారంలో ఉన్న లిపులు బ్రాహ్మి, ఖరోష్ఠి లిపులు. జైన, బౌద్ధ గ్రంథాలలో బ్రాహ్మి లిపియే ప్రాచీనమని తెలుస్తోంది. ఈజిప్టు చిత్ర లిపి నుండే ప్రపంచంలోని భాషలన్నీ పుట్టాయని పాశ్చాత్య విద్వాంసుల అభిప్రాయం. బ్రాహ్మి, సింధు నాగరికత లిపులకు చిత్ర లిపి భూమిక అని భారతీయ పండితులు

విశ్వసిస్తున్నారు. సింధు నాగరికత లిపియే బ్రాహ్మీ లిపికి మూలమని మరొక వాదం వినిపిస్తుంది. ఆదిమ జాతి వార్తావినిమయం జరపటమే కాదు గ్రంథాలను కూడా లిఖించే వారని చరిత్ర చెబుతుంది.

తెలుగు లిపి దక్షిణ బ్రాహ్మీ లిపి నుండి పుట్టింది. గుండ్రంగా మారి తన స్వతంత్రతను నిలుపుకుంది. భారతదేశం అనేక భాషలకు నిలయం. కనుక అనేక లిపులకు చోటిచ్చింది. బహు భాషా వ్యవహర్తలందరికీ మధ్య ఏక భాషా వ్యవహారానికి ఏక లిపి వ్యవహారానికి అనేక మంది కృషి చేశారు. ఆ కృషి ఫలితమే ఈనాటి లిపికి ఆధారం.

## తెలుగు లిపి పరిణామం

భాషకు భౌతిక రూపమే లిపి. ప్రపంచంలో ఏ భాష అయినా ఏర్పడటమనేది ఎంత ప్రదానమో ఆ భాషకు లిపి ఏర్పడటం కూడా అంతే ముఖ్యం. ఎందుకంటే లిపి భాషకు ప్రత్యేక స్థితిని కల్పిస్తుంది. కాబట్టి భాషా ధ్వనుల సంకేతాలే లిపి.

బ్రాహ్మీ లిపి అచ్చమైన స్వదేశీ లిపి. ఖరోష్ఠి లిపి సెమ్ జాతి వారి తెగ అయిన అరమీన్‌ల లిపి నుండి ఉద్భవించి బ్రాహ్మీ ప్రభావంతో సంస్కృత ప్రాకృతాలు రాయగల వర్ణమాలగా రూపుదాల్చింది. భారత దేశంలోని లిపులన్నీ బ్రాహ్మీ లిపి నుండే పరిణమించాయి.

సింధు లిపి లక్షణాలను తొలి రోజుల్లో బ్రాహ్మీ లిపి పుణికి పుచ్చుకుంది. సింధు లిపి అవలంబించిన 'హలరీతి'ని బ్రాహ్మ లిపి తొలి రోజుల్లో సౌలభ్యార్థం ఎడమ నుండి కుడికి రాసే విధానాన్ని స్థిరపరచుకుంది. కుడి నుండి ఎడమకు, ఎడమ నుండి కుడికి, నిటారుగా రాసే పద్దతులన్నాయి. సూర్యుని గతిని అనుసరించి రాత పద్దతి ఏర్పడిందంటారు. భాషలాగే లిపి కూడా మనుష్య స్వభావం కలది. సౌలభ్య సూత్రం వలన పదాలు, అక్షరాలు పుట్టి పునర్నిర్మాణానికి దారితీస్తాయి. అశోకుని కాలానికి ముందు నుంచే ఉత్తర బ్రాహ్మీ లిపి, దక్షిణ బ్రాహ్మీ లిపి కి ఉన్న భేదాన్ని గురించి దాక్షిణాత్య లిపులకు దక్షిణ బ్రాహ్మీ లిపి అని పేరు పెట్టారు. క్రీస్తు శకారంభం నుంచి భారతదేశానికి ఆగ్నేయ, ఆసియా దేశాలతో సాంగత్యం పెరగడం మూలంగా భారతీయ లిపుల్లో చాలా భేదాలు వచ్చాయి. ఔత్తరాహిక బ్రాహ్మీ లిపులు కొన్ని క్రీస్తు శకం 15వ శతాబ్దం తరువాత లుప్తమైనా బర్మా, థాయిలాండ్ వంటి దేశాల్లో స్వయం ప్రతిపత్తిని కలిగి నేటికీ మనగలుగుతున్నాయి. దక్షిణ బ్రాహ్మీ లిపి మాత్రం గుండ్రంగా మారి తమిళ, మళయాల, తెలుగు, కన్నడ భాషా లిపులుగా పరిణమించాయి.

## వేదకాలం నాటి లిపి

ప్రపంచ సాహిత్యానికి మూలంగా చెప్పుకునే భారతీయ వేద సాహిత్యంలో ఋగ్వేదం, యజుర్వేదం లోని భాగాలైన తైత్తరీయ బ్రాహ్మణం, శతపథం, పంచవింశతి, బ్రాహ్మణంలో లిపి ప్రస్తావన ఉంది. పాణిని అష్టాధ్యాయిలో, జైన, బౌద్ధ గ్రంథాలలో లిపి ప్రస్థావన కనిపిస్తుంది.

జైన, బౌద్ధ కాలంలో సంస్కృత పారశీక భాషల్లో సాహిత్యం లిఖితమయ్యింది. మాండలిక భాషలను ఉపదేశాత్మకాలకు ఉపయోగించారు. ఈ ఉపదేశాత్మక భాషే ప్రాకృత లేదా పాళీ భాష. మన దేశంలో ఎక్కువ ప్రచారంలో ఉన్న లిపులు బ్రాహ్మీ, ఖరోష్ఠి లిపులు, జైన, బౌద్ధ గ్రంథాలలో బ్రాహ్మీ లిపియే ప్రాచీనమని తెలుస్తుంది. బ్రాహ్మీ లిపి మన దేశంలో మొదటి లిపి అని నమ్మవచ్చు. దీనిని మౌర్య లిపి, అశోక లిపి, ధర్మ లిపి అని నేటి పరిశోధకులు అంటున్నారు. ప్రాంత భేదాన్ని బట్టి దక్షిణ బ్రాహ్మీ లిపి, ఉ

త్తర బ్రాహ్మీ లిపి అని అన్నారు. తెలుగు దేశాన్ని పాలించిన రాజులు వారి మాతృభాషల్లో, ప్రాంతీయ భాషల్లో శాసనాలను వేయించారు. ఆ రాజ వంశాల

పేర్లు మీదుగా లిపిని పేర్కొన్నారు. శాతవాహన లేదా ఆంధ్ర లిపి, ఇక్ష్వాకుల లిపి, చాళుక్య లిపి, విష్ణుకుండిముల లిపి, కాకతీయ లిపి అని ప్రస్థావించారు. మొత్తానికి తెలుగు లిపి అశోకుని ముందు క్రీస్తు పూర్వం 6, 7 వ శతాబ్దాలలో బుద్దుడు, మహావీరుని స్థూపాలపైన బ్రాహ్మీ, ఖరోష్ఠి లిపులున్నాయి. సింధు నాగరికత కాలం నాటి మొహంజదారో తవ్వకాలలో మట్టి దిమ్మెలపై ముద్రలు కనిపిస్తాయి. రేఖా ప్రాయంగా ఉన్న రేఖలు క్రమేపి అక్షర రూపం దాల్చాయి. భట్టిప్రోలు శాసనం క్రీస్తు పూర్వం 3 వ శతాబ్దం నాటిది. ఈ శాసనంలోని అక్షరాలకు అశోకునా కాలం నాటి అక్షరాలకు కొంత తేడా కనిపిస్తుంది.

## శాతవాహన లిపి

శాతవాహనులు తమ శాసనాన్ని కొండలు, గుహలలో వేయించారు. కాబట్టి వీరి లిపిని గుహ లిపి అన్నారు. వీరు శాసనాలన్నీ ప్రాకృత భాషలో వేయించారు. శాతవాహనుల మాతృ భాష ప్రాకృతం. వీరు ప్రాకృత భాషాభిమానులు. కానీ లిపి మాత్రం బ్రాహ్మీ లిపి. అప్పటికి తెలుగు భాష లేదని కాదు. తెలుగు భాష రాజులు దృష్టిని, సాహిత్య స్థాయిని అందుకోలేదు. అప్పుడు ఆంధ్ర దేశంలో ప్రబలంగా ఉ న్నది బౌద్ధ మతమే. అప్పటి ప్రాకృత శాసనాలలో నాగబు వంటి తెలుగు పదంతో బాటు వ్యక్తుల పేర్లు, గ్రామాల పేర్లు చేరకపోలేదు.

## ఇక్ష్వాక లిపి

శాతవాహనుల తర్వాత వేంగిని రాజధానిగా చేసుకుని ఆంధ్ర దేశాన్ని ఇక్ష్వాకులు కేవలం 50 సంవత్సరాలు పరిపాలించినా లిపిలో కొన్ని మార్పులు వచ్చాయి. బ్రాహ్మీ లిపి కొద్దిగా మార్పు చేర్పులతో కొనసాగింది. పట్టకారల్లా ఉన్న అ – K అనే అక్షరం క్రమంగా వాటి నిలువు గీతను ఎడమవైపుకు తిప్పుకుని ఇప్పటి ఆకారాన్ని పొందటానికి ప్రయత్నించినట్లుగా కనిపిస్తోంది.

## శాలంకాయన లిపి

వీరి కాలంలో లిపిలో మార్పులు ఒక కొత్త మలుపు తిరిగింది. వీరు వేంగిని రాజధానిగా చేసుకొని పరిపాలించారు. కాబట్టి వీరిని వేంగీయులని అన్నారు. వీరి కాలంలో లేఖకులు అక్షరాలను చాలా చక్కగా చెక్కేవారు. అక్షరాల మీద చిన్న అడ్డగీతలు చేరాయి. ఇవి నేటి తలకట్టుకు మూల రూపంగా నిలిచింది.

## విష్ణుకుండినుల లిపి :

ఈ కాలంలో లిపి అనేక ప్రధాన మార్పులకు లోనయ్యింది. శాలంకాయనుల కాలం నాటి అక్షరాలపై ఉన్న అడ్డుగీత అన్నింటిపైకి చేరింది. భారతదేశం నుండి జావ, ఇండోనేషియా, బాలీ, ఫిలిఫైన్స్ ప్రాంతాలకు వలస వెళ్ళిన హిందువులు ఆ లిపిని మొదట వాడారు. ఒకప్పుడు తెలుగులో ఉండి తరువాత తమిళంలో స్థిరపడిన ఱ వర్ణం విష్ణుకుండినుల కాలం నాటిదే. ఈ కాలంలో అక్షరాలపై అడ్డుగీత వంకరగా కుడి నుండి ఎడమకు వంగి నేటి తలకట్టుకు చేరింది.

కుబ్జవిష్ణువర్ధనుని కాలాన్ని (క్రీస్తు శకం 7వ శతాబ్దాన్ని) చాళుక్యుల కాలం అన్నారు. ఈ కాలంలో లిపిలో అనేక మార్పులు వచ్చాయి. చాళుక్యులు వేంగీ రాజధానిగా పాలించటం వలన వేంగీ చాళుక్యులని వీరి లిపిని వేంగీ చాళుక్య లిపి అని వ్యవహరించారు. వీరి తర్వాత వచ్చిన రాష్ట్రకూటులు కూడా వీరినే అనుసరించారు. చోళుల కాలంలో చోళ, చాళుక్య లిపిని శాసనాలలో ప్రయోగించారు. వీరి కాలంలో తెలుగులో మొట్టమొదటి శాసనం క్రీస్తు శకం 575 కు చెందిన ఎరికల్‌ముత్తురాజు వేయించిన ఎఱ్ఱగుడిపాడు శాసనం ప్రధానమైనది.

క్రీస్తు శకం 10, 11, 12 శతాబ్దాలలో లిపి కాలాన్ని సంధి యుగం అన్నారు. తెలుగు, కన్నడ భాషలు విడివడే సందర్భం కనుక అనేక మార్పులు వచ్చాయి. ఈ కాలం నాటికి లిపి వివిధ రూపాలలో చాలా మార్పులకు లోనయ్యింది. తెలుగన్నడ లిపి అన్నారు. నన్నయ భారతాన్ని తెలుగు, కన్నడ కలిసిన వేంగీ చాళుక్య లిపిలోనే రాసి ఉంటారు. మనకు భారత ప్రతులు దొరకక పోయినా నన్నయ వేయించిన నందంపూడి శాసనం, కోరుమిల్లి శాసనం ఆనాటి లిపికి ఆధారంగా నిలుస్తున్నాయి. నన్నయ కాలంలో అక్షరాలపై తలకట్టు వచ్చి చతికిలబడింది. ఱ అనే వింత అక్షరం అంతరించింది.

సంధికాలపు శాసనాలలో పూర్ణబిందువు (0) చుక్కగా (.) ఉండేది. అది కాలక్రమేణా పూర్ణబిందువుగా రూపాంతరం చెందింది. దీనికి ప్రధాన కారణం చుక్క శాసనాలలో శిథిలమవుతుండటం వలన దానిని పూర్ణ చంద్రాకారంలో '0' ఉపయోగించారు. పూర్ణ బిందువును మొదట అక్షరంపైన పెట్టారు. ఆపైన కుడి వైపున, ఎడమవైపున ఉపయోగించారు. కాలక్రమేణా పూర్ణ బిందువు పంక్తిలోకి వచ్చి అక్షరం ఎడమవైపున చేరింది.

మహాప్రాణాలకు అక్షరం కింద గూటం వచ్చింది. ఈ గూటం పూర్వం అర్ధ చంద్రాకారంలో అక్షరం కింద బోర్లించినట్లుగా ఉండేది. అది క్రమేపి చక్కగా నిలువుగా నిలిచింది.

## ధ్గ – ధ

చ కారానికి తలకట్టు వచ్చింది. ఛ కారానికి కుడివైపు గుండ్రంగా రూపు దిద్దుకుంది. కాకతీయుల కాలంలో లిపి స్థిరంగా నిలిచింది. వీరి కాలంలో మంచన, జక్కనలు తెలుగు లిపిని ప్రత్యేకంగా పేర్కొన్నారు. రెడ్డి రాజుల కాలంలో ఒకటి రెండు అక్షరాలు మినహా మిగిలిన అక్షరాలన్నీ గుండ్రంగా రూపుదిద్దు కున్నాయి. శ్రీనాథుని కాలానికి తలకట్టు కాస్తా కుడివైపుకు కిందకు వంగి సుడి తిరిగి దీర్ఘంగా మారింది.

భట్టిప్రోలు శాసన కాలంలో ఉత్వం అక్షరం కింద అడ్డుగీతగా ఉండేది. అది క్రమంగా కుడి భాగం పైకి తురాయిగా లేచి గుండ్రంగా తయారయ్యింది. గుణింతాలలో పెక్కు మార్పులు చోటు చేసుకున్నాయి.

విజయ నగర కాలంలో లిపి ఉచ్ఛస్థితిని చేరుకుంది. తెలుగు లిపి స్థిరపడింది. వీరి కాలంలోనిదే హ అనే అక్షరం. ఖండ బిందువు లేదా అరసున్నా పదహారవ శతాబ్దం నాటిది. నన్నయ కాలంనాటి శాసనాల్లో అరసున్న లేదు. పూర్ణానుస్వారమే రాసేవారు. విరామానికి ఒక నిలువు గీతను, సమాప్తికి రెండు నిలువుగీతలను ఉపయోగించారు.

క కారంగా భ్రాంతి చెందించే ళ కారం ళ కారంగా రూపుదిద్దుకుంది. తాలవ్య చ, జ లకు పైన ' జడపం ా అనే గుర్తు వచ్చి దంత్య చ,జ లుగా మారాయి. దీనిని చుక్కపెట్టి గుర్తించాలని అప్పకవి అప్పకవీయంలో తెలిపాడు. 19వ శతాబ్దంలో సి.పి.బ్రౌన్ దీనిని ప్రవేశ పెట్టారని కొంతమంది అభిప్రాయం.

తెలుగు లిపి పరిణామాన్ని గమనించినట్లయితే తెలుగు లిపి ధ్వని విధేయలిపిగా కనిపిస్తుంది.